# సీత పాదాభివందనం

శివ ధనుర్భంగం గావించాడు రాముడు.

సీతా రాముల కళ్యాణ మహోత్సవం నిర్విఘ్నంగా జరిగిపోయింది.

నూతన దంపతులు పెద్ద లందరికీ పాదాభివందనాలు చెయ్యడం అయిపోయింది.

వివాహానంతరం వధువు, ప్రత్యక్ష దైవమైన భర్తకూ పాదాభివందనం చెయ్యడం పరిపాటి.

సీతను రామునికి పాదాభివందనం చెయ్యమన్నారు.

అందరు పెద్దలకూ, భర్తతోబాటుగా ముచ్చటగా పాదాభివందనం చేసి, ఆశీర్వచనాలు పొందిన సీత, రామునికి పాదాభివందనం అనేసరికి కదలక పోయింది.

ఒకసారి — రెండుసార్లు — మూడుసార్లు- హెచ్చరించారు. అయినా, ఆమెలో చలనం లేదు.

రాముని చిగురు పెదవులపై చిరునవ్వు.

'ఎంత స్వాతిశయం' అనుకొంది కైక.

'అయ్యో, అయ్యో', అన్నారందరూ.

తల్లి 'అమ్మాయ్ సీతా, రామునికి పాదాభివందనం చెయ్యవమ్మా', అంది మందలింపుగా.

అయినా, సీతలో అదే అచేతనం.

కౌసల్య కాస్త చొరవ తీసుకొని "రామునికి పాదాభి వందనం చెయ్యమ్మా" అంది అనునయంగా.

ఊహూ-అదే మౌనముద్ర!

ఆడవాళ్ళ వంతైంది.

జనకుడు, కుమార్తెను ఒడిలోకి తీసుకొని బుజ్జగించాడు. తండ్రి ఒడిలో సిగ్గుల మొగ్గయిన సీత నోటినుంచి ముత్యాలు రాలాయి! "నాన్నా, ఇంతకుముందే విన్నాముగామా! శిలకు వారి పాదం తాకి, ఆడదైంది. ఆ అహల్యకు భర్త గౌతములు వున్నారు కాబట్టి సరిపోయింది. నా శిరస్సునవున్న కిరీటంలో నవరత్నాలున్నాయి. వారికి పాదాభి వందనం చేస్తాను, నాదేంపోయింది. శ్రీవారి పాదస్పర్శతో నవరత్నాలు కాస్తా నవకన్యలైతే - వారు శ్రీవారి శ్రీమంతులై తీరుతారు.నాకు సవతులు తోడయ్యే మాటెల్లా వున్నా, శ్రీరామచంద్రునికి భావికాలంలో రావలసిన ఏకపత్నీవ్రత గౌరవం ఏం కావాలినాన్నా? అదే నా తటపటాయింపు" అంటూ ముద్దులు కుడిచింది తండ్రి ఒడిని.

లక్ష్మణుడు ముసి ముసిగా నవ్వుకున్నాడు.

రాముని చిగురు పెదవులపై అదే చిరునవ్వు.

సీత, రామునికి పాదాభివందనం చేయకనే, అనంతర కార్యక్రమాలకు ఉపక్రమణ జరిగింది.

—చుండూరు జనార్ధనగుప్త